క్లుప్తంగా

అమిత్‌షా పర్యటనపై నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గోపవరం : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసస్తూ గోపవరం మండలం పి.పి.కుంట వద్ద సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ మాట్లాడుతూ కేంద్ర హోంశాఖమంత్రిగా పని చేస్తున్న అమిత్‌షా పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆయనను అవమానపరచడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పెంచలయ్య, ఏరియా కార్యవర్గ సభ్యులు రమణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ సంఘ వార్షికోత్సవం



రామకృష్ణాశాస్త్రిని సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొత్త రాఘవేంద్ర స్వామి ఆలయ సమీపంలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వి.కంబగిరిరావు సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. నారాయణ అన్న ప్రసాదం నిరంతరాయంగా కొనసాగేందుకు సభ్యులు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ వేడుకల్లో భాగంగా తాళ్లమాపురం తాత కొరటమద్ది వెంకట సుబ్బావధానుల సంస్మరణ సభ నిర్వహించారు. అలాగే తిరుపతికి చెందిన వేదపండితులు బ్రహ్మశ్రీ పురిగెళ్ల రామకృష్ణాశాస్త్రిని ఈ సందర్భంగా శాలువా కప్పి మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి తిరుమల చంద్రశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయుడు గంగరాజు, ఏపీబీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, సంఘ మహిళా అధ్యక్షురాలు విశాలాక్షి, బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. బి.మఠం మండలం బ్రహ్మంసాగర్‌లోని బృహత్తర తాగునీటి పథకం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆదివారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఇందులో భాగంగా సిబ్బందితో ప్లాంట్‌ను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీకి అందించే తాగునీటిని ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సరఫరా చేస్తున్నామని, ప్రజలు బాధ్యతగా నీటిని వృథా చేయకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహేష్, ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

చాపాడు : మండల పరిధి నెర్రవాడ గ్రామ సమీపంలోని వనంలో ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు డివిజనల్ సెంటర్ కో ఆర్డినేటర్ దేవగుడి సురేంద్ర ధ్యానం పట్ల స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు మేకల బాబు, అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి ఆలయ చైర్మన్ వీరనారాయణ, టీడీపీ నాయకులు గుత్తి వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

కాశినాయన : మండలంలోని పాడి రైతులు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు జరగబోయే పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న కోడిగుడ్లపాడు, 21న గొంటువారిపల్లె, 22న కొండ్రాజుపల్లె, 23న గంగనపల్లె, 24న సావిశెట్టిపల్లె, 25న వరికుంట్ల, 27న నరసాపురం, 28న చిన్నాయపల్లె, 29న రెడ్డికొట్టాల, 30న ఇటుకులపాడు, 31వ తేదీన ఆకులనారాయణపల్లె గ్రామాల్లో శిబిరాలను నిర్వహిస్తామన్నారు.

చాపాడు : మండలంలోని 11 గ్రామాలలో సోమవారం నుంచి పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. 20న బద్రిపల్లె, 21న చిన్నగురువళూరు, 22న చెంచుపల్లె, 23న గాంధీనగర్, 24న ఓబుళరెడ్డిపేట, 25న ఖాదర్‌పల్లె, 27న మొర్రాయిపల్లె, 28న నరహరిపురం, 29న ద్వారకానగరం, 30న వెదురూరు, 31న అన్నవరం గ్రామాలలో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బ్రహ్మంగారిమఠం : మండల వ్యాప్తంగా సోమవారం నుంచి గ్రామాలలో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి నిత్యానంద్ తెలిపారు. 20న సోమిరెడ్డిపల్లె, 21న పలుగురాళ్లపల్లె, 22న తోట్లపల్లె, 23న మల్లేపల్లె, 24న ముడుమాల, 25న డి.అగ్రహారం, 27న నాగిశెట్టిపల్లె, 28న కమ్మవారిపల్లె, 29న గోపిరెడ్డిపల్లె, 30న జి.నరసింహాపురం, 31న గొడ్లవీడు గ్రామాలలో పశు వైద్య శిబిరం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

పరిష్కారం పరిహాసమేనా..!

- రెవెన్యూ సదస్సుల్లో అర్జీల వెల్లువ
- స్వీకరణకే పరిమితమైన అధికారులు
- ఉన్నతాధికారుల చేతుల్లోనే పరిష్కారం
- చేతులెత్తేసిన స్థానిక అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



రంపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్ (ఫైల్)

కాశినాయన : 'ప్రజల వద్దకే ప్రభుత్వం ... అక్కడే సమస్యలకు పరిష్కారం' అనే నినాదంతో కూటమి సర్కారు ఆర్భాటంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలకు అతీగతీ లేకుండా పోయింది. సదస్సుకు హాజరై వినతులు సమర్పిస్తే తమ బాధలు తీరుతాయనే తలంపుతో మండల ప్రజలు అర్జీలు సమర్పించుకున్నారు. సదస్సుల్లో అవి వెంటనే పరిష్కారమవుతాయని ఆశపడ్డారు. కానీ వారి ఆశలు అడియాశలుగానే మారిపోతున్నాయి. అర్జీలు స్వీకరించిన అధికారులు ఎప్పుడు? ఎవరు? ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారు అనే అంశాలపై రెవెన్యూ సదస్సుల్లో స్పష్టత ఇవ్వలేదు. రెవెన్యూ సమస్యలు అధిక శాతం జాయింట్ కలెక్టర్ పరిష్కారం చూపాలని క్షేత్రస్థాయి అధికారులు చెబుతుండటంతో గందరగోళం నెలకొంది.

వినతుల వెల్లువ

మండల వ్యాప్తంగా 2024 డిసెంబర్ 6వ తేదీ నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో 819 మంది వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క అర్జీ కూడా పరిష్కరించిన దాఖలాలు లేవు. భూ వివాదాలు పరిష్కరించాలని, తమకు భూమి కేటాయించాలని, ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని అధిక శాతం మంది ప్రజలు అర్జీలు సమర్పించుకున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో పేరు మార్పు, అసైన్డ్ భూమి తండ్రి పేరు మీద ఉండి.. తండ్రి చనిపోతే భార్య పేరు మీద మార్చాలని ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో సమస్యలు. మరోవైపు ఈ సమస్యలకు పరిష్కారం చూపడం తహసీల్దారు పరిధిలో కూడా లేదు. ఇటువంటి సమస్యలు జేసీ పరిధిలోనే పరిష్కారమవుతాయని, జేసీకి ఫైల్ పెట్టి పరిష్కరించాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు తాము ఏమీ చేయలేమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. గ్రామంలోనే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి.. ఇప్పుడేమో ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చేంత వరకు తమ చేతుల్లో ఏమీ లేదని అధికారులు చెబుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. జాయింట్ కలెక్టర్ చేతిలో అధికారాలు ఉండటంతో తహసీల్దారు కార్యాలయాలకు ప్రాధాన్యం తగ్గిపోతుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎప్పుడో రిజిస్ట్రేషన్లు అయిన భూములు సైతం ఆన్‌లైన్‌లో నమోదుకాకపోవడంతో ప్రజలు కాళ్లరిగేలా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సమస్యలకు స్పష్టమైన పరిష్కారాలు చూపలేక రెవెన్యూ అధికారులు సతమతమవుతున్నారు. ఈ మాత్రం దానికి సదస్సులు పెట్టడం దేనికని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తుల కొంగుబంగారం

- కోర్కెలు తీర్చే తల్లిగా మాతమ్మ ప్రసిద్ధి
- శుక్ర, ఆదివారాల్లో భక్తుల సందడి



మాతమ్మతల్లి ఆలయం



అమ్మవారికి పూజ చేస్తున్న పూజారి

బి.కోడూరు : భక్తుల కొంగుబంగారంగా మాతమ్మతల్లి విరాజిల్లుతున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందారు. బి.కోడూరు మండలం ఐత్రంపేట పంచాయతీలోని సిరిగిరిపల్లె గ్రామ సమీపాన వెలసి ఉన్న ఈ మాతమ్మతల్లి ఆలయం సుమారు వందేళ్ల క్రితం నిర్మించారు. ఈ ఆలయానికి వెంకటయ్య వారసులు ధర్మకర్తలుగా, పూజారులుగా ఉంటూ నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పోరుమామిళ్ల, బద్వేలు, బి.మఠం, గోపవరం, అట్లూరు, కలసపాడు, కాశినాయన మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రతి శుక్ర, ఆదివారాల్లో భక్తులు వస్తుంటారు. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు దీర్ఘకాలిక వ్యాధులకు గురైతే.. ఆ కుటుంబంలోని సభ్యులు ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజారులు మంత్రించి ఇచ్చే సాంబ్రాణి పొగ వేసుకుని తీర్థం స్వీకరించి తాయత్తులు ధరిస్తే నయమవుతాయని భక్తుల నమ్మకం. మూగజీవాలకు కూడా ఏదైనా వ్యాధి సోకితే.. అమ్మవారిని దర్శించుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజారి మంత్రించి ఇచ్చే తవుడు తదితరాలను వాటికి తినిపిస్తే నయమవుతుందని వారు చెబుతున్నారు. దీంతో ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. పురాతనమైన ఆలయం కావడంతో శిథిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు.

ఆలయానికి చేరుకోవాలంటే..

ఈ ఆలయానికి పోరుమామిళ్ల– బద్వేలు రోడ్డులోని ఐత్రంపేట నుంచి గానీ, మున్నెల్లి రోడ్డు నుంచి గానీ ప్రత్యేక ఆటోల ద్వారా చేరుకోవచ్చు. భక్తుల సౌకర్యార్థం ఉదయం 8 గంటల నుంచే వెంకటయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

నిమిత్తమాత్రులం మాత్రమే



ఈ అమ్మవారిని దర్శించుకుని కోర్కెలు కోరితే తీరుతాయనే గట్టి నమ్మకంతోనే ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. మేము కేవలం నిమిత్తమాత్రులం మాత్రమే. మేము ఆ తల్లిపై భారం వేసి పూజలు నిర్వహిస్తూ ఉంటాం. మా కుటుంబ సభ్యులు నిత్యం ఆ తల్లిని పూజిస్తుంటాం.

– సుబ్బయ్య, పూజారి

భక్తుల ఆకలి తీర్చడమే ఆనందం



నేను ఈ ఆరుపదుల వయస్సులో కూడా ప్రతి శుక్రవారం, ఆదివారం వేకువజామునే ఆలయానికి చేరుకుంటాను. భక్తుల అన్నదానానికి అన్ని ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటాను. భక్తుల ఆకలి తీర్చడమే మాకు ఆనందం.

– వెంకటయ్య, సిరిగిరిపల్లె, బి.కోడూరు మండలం

వేమన పద్యాలు.. వెలకట్టలేని మూటలు



మాట్లాడుతున్న వేమన సేవా సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి



పద్య, చిత్రలేఖనం పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

- వేమన సేవా సమితి గౌరవాధ్యక్షుడు నాగదస్తగిరిరెడ్డి
- ఘనంగా వేమన జయంతి



వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏపీ రెడ్డి సంఘం నాయకులు



వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో వేమన చిత్రపటం వద్ద యూనియన్ నాయకుల నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : వేమన పద్యాలు వెలకట్టలేని మూటలు అని వేమన సేవా సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆదివారం గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి శివాలయం వీధిలోని వేమన విగ్రహానికి వేమన సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం శివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేమన తన పద్యాల ద్వారా సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలు, దురాచారాలను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. వేమన సాహిత్యం ఈ తరం పిల్లలు నేర్చుకుని భావాన్ని తెలుసుకోవాలన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ వేమన పద్యాలపై పోటీలను నిర్వహించడం వల్ల విద్యార్థులలో పోటీ తత్వం అలవడుతుందని పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువులబాబు మాట్లాడుతూ వేమన తక్కువ పదాలతో ఎక్కువ అర్థాన్ని ఇచ్చే విధంగా పద్యాలను రచించారన్నారు. అనంతరం పద్యపఠం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, వేమన శతకం పుస్తకాలను అందించారు. వేమన సేవా సమితి అధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వేమన గొప్పతనాన్ని తెలిపేందుకు తాము సంస్థ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు, విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేమనసేవా సమితి ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, శివాలయం చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, స్పందన అధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, మద్దిలేటి, సాయికుమార్, నాగరాజాచారి, యడవల్లి రమణయ్య, సుధారాణి, పల్లా కృష్ణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త యోగి వేమన

ప్రొద్దుటూరు : గొప్ప సంఘ సంస్కర్త ప్రజా కవి యోగి వేమారెడ్డి అని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి తెలిపారు. స్థానిక శివాలయం రోడ్డులోని వేమన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా కవి వేమన విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో రాసిన పద్యాలు అందరికీ సుపరిచితమే అన్నారు. ఆయన రాసిన పద్యాలను సీపీ బ్రౌన్ పుస్తక రూపంలో వెలుగులోకి తీసుకొచ్చారని తెలిపారు. వేమారెడ్డి సరళమైన తెలుగు భాషలో సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా పద్యాలు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, ఏపీ రెడ్డి సంఘం వీరపునాయునిపల్లె మండల అధ్యక్షుడు వేమ నారాయణరెడ్డి, సభ్యులు బొమ్ము లక్ష్మీ పుల్లారెడ్డి, రమణారెడ్డి, నారుపల్లె లక్ష్మీ నారాయణరెడ్డి, అమ్మిరెడ్డి చిన్న అంకిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో..

స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో నాన్ టీచింగ్ యూనియన్ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాలేజీలోని క్రీడాకారులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోతిరెడ్డి ప్రకాష్ రెడ్డి, ఆలూరు రాజశేఖర్, పూజల రామదాసు, పోలక దనసుదన్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, నాగేశ్వరులు పాల్గొన్నారు.

ప్రైవేటు డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాసంఘాలు, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కొంత మంది ప్రైవేట్ వైద్యులు వైద్యం కోసం లక్షలాది రూపాయలు ప్రజల నుంచి దోచుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు గడ్డం నరసింహులు, జగన్, ఓబులేసు, దాసు, మస్తాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని మల్టీ స్పెషాలిటి హాస్పిటల్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డీఐఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హాస్పిటల్ నిర్లక్ష్యం కారణంగానే శనివారం ఒకరు మృతి చెందారన్నారు. హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఆస్పత్రి వద్ద ఆందోళనలు చేసిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని చెప్పారు. సమావేశంలో చిన్న రమణయ్య పాల్గొన్నారు.

బద్వేలు మాజీ ఎమ్మెల్యేతో రఘురామిరెడ్డి భేటీ



బద్వేలు మాజీ ఎమ్మెల్యేతో చర్చిస్తున్న మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : బద్వేలు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణయ్యను ఆదివారం సాయంత్రం మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కలిశారు. బ్రహ్మంగారిమఠం మండల అధ్యక్షులు వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రామగోవిందరెడ్డి, దువ్వూరు మాజీ జెడ్పీటీసీ బాబులతోపాటు మరి కొందరు మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా పలు రకాలైన రాజకీయ అంశాలపై చర్చించారు.

బాధితులకు పరామర్శ

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాద బాధితులను మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల చిన్నగురువళూరుకు చెందిన యువకులు ఎర్రమాచు రాజేష్‌రెడ్డి, కె.శివానందరెడ్డి, పి.శ్రీధర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డిలు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్సలో భాగంగా ఇంటి వద్ద ఉన్న వీరిని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు. వీరి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి పలుకరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్షుమయ్య, వివేకానంద స్కూల్ కరస్పాండెంటు నాగేశ్వర్‌రెడ్డి, అల్లాడుపల్లె సర్పంచ్ కిషోర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఎల్లారెడ్డి, శివారెడ్డి, రాజారెడ్డి, చంద్రఓబుళరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న సీఐ, ఎస్ఐ, నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. మొత్తం 38 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో రాజుగారివీధి, బయనపల్లె జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాజుగారివీధి జట్టు విజేతగా నిలిచింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ క్రీడల ద్వారా యువతకు సంపూర్ణ ఆరోగ్యంతోపాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని అన్నారు. విజేతగా నిలిచిన రాజుగారి వీధి జట్టుకు రూ.50,116, రన్నరప్‌గా నిలిచిన బయనపల్లె జట్టుకు రూ.30,116, అలాగే మూడవ బహుమతిగా శివానగర్ కింగ్స్ జట్టుకు రూ.10,116 బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ రవికుమార్, పంచాయతీ ఇన్‌చార్జి నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ ఆరేళ్ళ వేణుయాదవ్, ఉప సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, ఆర్గనైజర్లు విజయ్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై భయం వద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధి పట్ల ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ సకాలంలో వ్యాధిని గుర్తించి యంటీబీ మందులు వాడితే పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని కోరారు. సర్వేకు కావలసిన సామగ్రిని సిబ్బందికి అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఓ ఎంవీసుబ్బారెడి ఫార్మాసిస్టు దినేష్, స్టాఫ్‌నర్సులు విజయశాంతి, రాజకుమారి పాల్గొన్నారు.

గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దు

గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక లక్ష్యా కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి 53 మంది రోగులను పరీక్షించి తగు సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ, గుండె స్కానింగ్ చేశారు. డాక్టర్ హరిత 32 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సత్కరించిన వివిధ పదవుల్లో నూతనంగా నియమితులైన నాయకులు

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పోరుమామిళ్ల/అట్లూరు : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు పార్టీ పురోభివృద్ధికి అంకితా భావంతో పని చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ల పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముందుగా వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ యాక్టివేట్ కన్వీనరుగా నియమితులైన పి.రాజశేఖర్‌రెడ్డి (ప్రభాకర్‌రెడ్డి) వారిని మర్యాద పూర్వకంగా కలసి శాలువలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి నూతనంగా వివిధ పదవుల్లో నియమితులైన వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి, కలసపాడు, బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ సభ్యులు గురివిరెడ్డి, రామగోవిందరెడ్డి, కలసపాడు, బ్రహ్మంగారిమఠం మండల అధ్యక్షులు నారాయణ, వీరనారాయణరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లి నరసింహులు, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, కలసపాడు పార్టీ మండల కన్వీనరు సుదర్శన్, మాజీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, రంగసముద్రం సర్పంచు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా యాక్టివిటీ కన్వీనరు చిత్తా రాజశేఖర్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయిపాటి నారాయణరెడ్డి, ఉపసర్పంచు రవిచంద్రారెడ్డి, పార్టీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, శ్రీరాములు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులపై సీఎం శ్రద్ధ చూపాలి

ప్రొద్దుటూరు : రాయలసీమ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు నాయుడు శ్రద్ధ చూపాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మైదుకూరు పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడు రాయలసీమను రతనాల సీమగా మారుస్తాననడం హాస్యాస్పదంగా ఉందని ఆయన పేర్కొన్నారు.